క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: యనమలకుదురులో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ పి.హరిబాబు తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ సబ్ స్టేషన్ మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తామని పేర్కొన్నారు. గ్రామంలో తాడిగడప డొంక రోడ్డు, జన్మభూమి వంతెన రోడ్డు, ఇందిరానగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని తెలిపారు. స్థానికులు సహకరించాలని ఆయన కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కేసరపల్లి(గన్నవరం): ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని గన్నవరం ట్రాఫిక్ ఎస్సై వై. దుర్గారావు సూచించారు. మండలంలోని కేసరపల్లి శివారులోని వీకేఆర్ కళాశాల వద్ద రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం నేరమన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ పొందేందుకు అర్హులని తెలిపారు. ట్రాఫిక్ ఏఎస్సై దాసు పాల్గొన్నారు.

యోగాతో వ్యక్తిత్వ వికాసం



ఉయ్యూరు: యోగాతో వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందని ప్రముఖ సైకాలజిస్ట్ తేజావతి పేర్కొన్నారు. పట్టణంలోని ఏజీఅండ్ఎస్‌జీ సిద్ధార్థ జూనియర్ కళాశాల్లో రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్, పర్సనాలిటీ డెవలెప్మెంట్‌పై శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సైకాలజిస్ట్ తేజావతి మాట్లాడుతూ అంకితభావంతో నిశ్చలమైన మనస్సుతో కష్టపడితే నూరు శాతం విజయం వరిస్తుందన్నారు. విద్యార్థులు యోగా, దైవప్రార్థన అలవర్చుకోవాలన్నారు. వ్యక్తిత్వ వికాసంతోనే ఎంచుకున్న లక్ష్యాలను అధికమించవచ్చని పేర్కొన్నారు. యువజన సర్వీసుల శాఖ ఉమ్మడి కృష్ణా జిల్లా అసిస్టెంట్ మేనేజర్ ఎం.నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించేందుకు, కెరీర్ గైడెన్స్ దిశా నిర్దేశం చేసేందుకే ప్రభుత్వం కళాశాలల్లో కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ జగదీష్, జూనియర్ కళాశాల డైరెక్టర్ జీజేపీ వినయ్‌కుమార్, ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి, అధ్యాపకుడు నజీరుద్దీన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

గన్నవరం: స్థానిక హెచ్‌పీ గ్యాస్ కంపెనీ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు గన్నవరం నుంచి హనుమాన్‌జంక్షన్ వైపు వెళ్తున్న ఆటోను గ్యాస్ కంపెనీ వద్ద వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో ఆటో అదుపుతప్పి జాతీయ రహదారి పక్కన కల్వర్ట్‌పై కూర్చొన్న వ్యక్తులపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఓ కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించిన పోలీసులు ఈ ఘటనపై విచారణ చేపట్టారు.

దుప్పట్ల పంపిణీ

నున్న(విజయవాడరూరల్): ఆజాద్ ముస్లిం కమిటీ ఐదో వార్షికోత్సవం సందర్భంగా నున్న టీచర్స్ కాలనీలో మక్కామసీదు వద్ద పేద ముస్లింలకు శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా పేదలకు ఆజాద్ ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో సేవాకార్యక్రమాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. రంజాన్ మాసంలో మన సంపాదనలో జకాత్ తీసి, వాటితో పేద ముస్లింలకు సేవలందిస్తామన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఆజాద్ ముస్లిం కమిటీ గన్నవరం నియోజకవర్గం అధ్యక్షుడు నాగుల్‌మీరా, ప్రధాన కార్యదర్శి హిదయతుల్లా మస్లిద్, ఉపాధ్యక్షుడు సయ్యద్ మస్తాన్‌వలి, రాష్ట్ర సహాయ కార్యదర్శి సయ్యద్ మౌలాలి, నున్న అధ్యక్షుడు మహబూబ్ బాషా, ఉపాధ్యక్షుడు గౌస్, ప్రధాన కార్యదర్శి సుభాని పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి

నున్న(విజయవాడరూరల్): సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని వెలగలేరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి మాధురీదేవి పేర్కొన్నారు. ప్రతి నెలా మూడో శుక్రవారం నున్న-2 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో నిర్వహించే ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ఉచిత పరీక్షలను వైద్యులు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాధురీదేవి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, పౌష్టికాహారం తీసుకోవడం వలన ఆరోగ్యవంతంగా ఉండవచ్చన్నారు. తద్వారా సీజనల్ వ్యాధులు రాకుండా చూసుకోవచ్చని తెలిపారు. అనంతరం వృద్ధులకు జ్వరం, దగ్గు, బీపీ, షుగర్ తదితర వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం 7వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో సీహెచ్‌ఓ సుస్మిత, ఏఎన్ఎం లక్ష్మి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం



మార్కెటింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న ఏడీఏ సునీల్, ఏఓ తేజశ్వి

గన్నవరం రూరల్: రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని గన్నవరం వ్యవసాయ శాఖ ఏడీఏ ఎం.సునీల్ పేర్కొన్నారు. మండలంలోని సూరంపల్లి గ్రామం రైతు భరోసా కేంద్రాన్ని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌బీకే ద్వారా రైతులకు అందుతున్న సేవలను సిబ్బందితో సమీక్షించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను, రిజిస్టర్లు, సంచులు రైతులకు అందజేసిన రిజిస్టర్లు, తేమశాతం నమోదు రిజిస్టరు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రంగు మారిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. 10 నుంచి 20శాతం లోపుగా రంగు మారిన 75 కేజీల బస్తాకు రూ.1,450, 20 నుంచి 30శాతం రూ.1,390, 30 నుంచి 40శాతం రూ.1,125, 40 శాతం నుంచి ఆపైన రంగు మారితే రూ.1,050కు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రైతుల ఖాతాల్లో నేరుగా నగదును ప్రభుత్వం జమ చేస్తుందని చెప్పారు. ఏ రైతుకు ఇబ్బందులు లేకుండా ఆర్‌బీకేల్లో సిబ్బంది పనిచేస్తునట్లు తెలిపారు. ఏఓ ఎన్ఎల్ తేజశ్వి, వీఏఏ రవితేజ, హెచ్ఏ దీక్షా, మార్కెటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రంగు మారిన ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

ఉంగుటూరు: రంగుమారిన ధాన్యం కూడా మిల్లర్లు కొనుగోలు చేయాలని తహసీల్దార్ డి.వనజాక్షి సూచించారు. మండలంలోని వేమండ, ఇందుపల్లి, ఆముదాలపల్లిలో ఆర్‌బీకేలు, ఉంగుటూరులో ఉషా రామా ట్రేడర్స్ రైస్ మిల్లును శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రంగుమారిన ధాన్యం బహిరంగ మార్కెట్‌లో మిల్లర్ల ద్వారా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. టెక్నికల్ అసిస్టెంట్ నిర్దేశించిన ధాన్యం యొక్క నాణ్యతా ప్రమాణాలు ప్రకారం చెడిపోయిన, రంగు మారిన శాతం ప్రకారం ధరల వివరాలు ఇలా ఉన్నాయి. 10 శాతం ఉంటే క్వింటాల్‌కు రూ.1,930, 75కేజీలకు రూ.1,450. 10 నుంచి 20శాతం ఉంటే క్వింటాల్ రూ.1,850, 75కేజీలకు రూ.1,390. 20–30 శాతం క్వింటా రూ.1,630, 75 కేజీలకు రూ.1,220, 30–40 శాతం క్వింటా రూ.1,500, 75 కేజీ రూ.1,125. 40శాతం పైబడి ఉంటే క్వింటా రూ.1,400, 75 కేజీ రూ.1,050 మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేయాలని ఆదేశించారు.



రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న తహసీల్దార్ వనజాక్షి

అక్షరాస్యతతో కుటుంబాల ఆర్థికాభివృద్ధి



బ్యాంకు సేవల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

కంకిపాడు: అక్షరాస్యతతో కుటుంబాల ఆర్థికాభివృద్ధి సాధ్యమని మంతెన సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజరు పి.రమేష్ పేర్కొన్నారు. మండలంలోని మంతెన గ్రామంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సంస్థ ఆధ్వర్యంలో రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఆదేశాలతో ఆర్థిక అక్షరాశ్యత కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజరు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బ్యాంకుల ద్వారా కలిగే ప్రయోజనాలను, పథకాల ఉపయోగాలను అర్థం చేసుకోవాలన్నారు. అవగాహనతో ఉంటే ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందన్నారు. సుకన్య సమృద్ధి యోజన ద్వారా ఆడపిల్లలకు ఆర్థిక భద్రత లభిస్తుందన్నారు. ఉన్నత విద్య కోసం విద్యార్థులకు ఎడ్యుకేషన్ లోన్, నిరుద్యోగులకు ముద్రా రుణాలు, సీనియర్ సిటిజెన్స్‌కు పింఛన్లు అందుతున్నాయన్నారు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకులు అందించే సేవలపై రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. సంస్థ కౌన్సిలర్లు కైలే సునీల్‌కుమార్, పల్లి రాజేష్ మాట్లాడుతూ బ్యాంకులు ద్వారా అందే సేవలను వివరించి, కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో వెలుగు సీసీ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాచైతన్యమే కళల పరమార్థం

పీఎన్ఎం రాష్ట్ర కార్యదర్శి అనిల్‌కుమార్



వడ్లమూడికి నివాళులర్పిస్తున్న నాయకులు

పెనమలూరు: ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే కళల పరమార్థమని ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పి.అనిల్‌కుమార్ పేర్కొన్నారు. యనమలకుదురు గ్రామంలో శుక్రవారం ప్రజానాట్య మండలి తొలితరం నాయకుడు ప్రజాకవి వడ్లమూడి నాగేశ్వరరావు 37వ వర్ధంతి సభలో ఆయన ప్రసంగించారు. వడ్లమూడి రాసిన పాటలు నేటికీ సామాజిక పరిణామాలకు అద్దం పట్టే విధంగా ఉన్నాయన్నారు. సమాజంలో కళాకారులు ఉంటేనే ప్రజా సమస్యలపై పోరాటం చేయవచ్చని వివరించారు. సమాజంలో మార్పులు తీసుకొచ్చేందుకు కళాకారుల పాత్ర చాలా కీలకమన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి నాయకులు గాదెసుబ్బారెడ్డి, జీవీ రంగారెడ్డి, షేక్ కాశిం, వడ్లమూడి కుమార్తె పద్మ, పల్లా చిన్నారావు, వలిమా, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

పేరంటాలమ్మ ఆలయంలో అన్నసంతర్పణ



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న పెద్దలు

రామవరప్పాడు: రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో సంక్రాంతి ఉత్సవాలు ఘనంగా ముగిసిన సందర్భంగా శుక్రవారం అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సుమారు 8వేల మంది భక్తులు పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి పాతూరి లోకేశ్వరి, బోయిన భాను ప్రదీప్ మాట్లాడుతూ రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామస్తులు, గ్రామ పెద్దల సహకారంతో సంక్రాంతి ఉత్సవాలను ఘనంగా పూర్తి చేశామన్నారు. అన్నసంతర్పణ కార్యక్రమానికి కూడా ఇరు గ్రామ పెద్దలు పూర్తి సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాలతో పాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు అమ్మవార్ల అన్నప్రసాదాన్ని స్వీకరించారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ట్రాఫిక్ పోలీసులు వాహనాలను క్రమబద్ధీకరించారు. జాతీయరహదారిని భక్తులు దాటేందుకు వీలుగా సహాయ, సహకారాలు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, వైఎస్సార్ సీపీ రామవరప్పాడు కన్వీనర్ సమ్మెట సాంబశివరావు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో విద్యుత్‌సబ్ స్టేషన్లు



నున్న జగనన్న కాలనీలో నిర్మిస్తున్న విద్యుత్‌సబ్ స్టేషన్

విజయవాడరూరల్ : రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకోసం ప్రత్యేకంగా విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మిస్తోందని ఏపీసీపీడీసీఎల్ ఏడీ బాలాజీనాయక్ తెలిపారు. నున్న గ్రామంలోని జగనన్న కాలనీలో సుమారు రూ.2 కోట్లతో ప్రభుత్వం నిర్మిస్తున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నున్న, సూరంపల్లి, కొండపావులూరు గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సదుపాయం కల్పించేందుకు 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మిస్తోందన్నారు. పైన పేర్కొన్న మూడు గ్రామాల్లో 19,500 మంది లబ్ధిదారులకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారుల ఇంటికి అవసరమైన మీటరు, సర్వీస్‌వైరు, ట్రాన్స్‌ఫార్మర్లు మొత్తం ఖర్చులు రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు. విద్యుత్ సదుపాయం కల్పించిన తర్వాత ఒక కిలోవాట్ విద్యుత్ వినియోగం వరకు లబ్ధిదారులు ఎలాంటి చార్జీలు చెల్లించనవసరం లేదన్నారు. లబ్ధిదారులకు విద్యుత్ సదుపాయంతో పాటు నీటి అవసరాలకు సంబంధించిన 40 బోర్లకు విద్యుత్ కనెక్షన్లు అందజేసి 24 గంటలు పవర్ సప్లయి ఉండేలా సదుపాయం కల్పించడం జరిగిందన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి ఇప్పటికే మూడు గ్రామాల్లో విద్యుత్ సదుపాయం కల్పించామన్నారు. నున్న విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

పంటను రక్షించేందుకు విద్యార్థుల ప్రాజెక్టు



పెదపులిపాకలో ప్రాజెక్టు ప్రదర్శిస్తున్నవిద్యార్థులు

పెనమలూరు: పంటలు పశువుల బారిన పడకుండా ఉండేందుకు ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రాజెక్టు రూపొందించారు. దేవినేని వెంకటరమణ ఎంబీసీ కాలేజీ ఇంజినీరింగ్ విద్యార్థులు ఈ మేరకు ప్రాజెక్టును పెదపులిపాకలో శుక్రవారం రైతులకు క్షేత్రస్థాయిలో అర్థమయ్యే విధంగా ప్రదర్శించారు. రైతులు పంటను పశువుల నుంచి రక్షించుకునేందుకు కంచె ఏర్పాటు చేసుకుంటారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టుతో కంచెతో పని లేదు. కాపర్‌వైరు, ట్రాన్సిస్టర్, బ్యాటరీ, బజర్, కెపాసిటర్, బల్బు, సెన్సార్ పరికరాలతో పొలంలో అమర్చాలి. పశువులు పొలంలోకి వచ్చిన సమయంలో తీగతగిలి పెద్ద శబ్దం వస్తుంది. దీంతో పశువులు బెదిరి వెళ్లిపోతాయని విద్యార్థులు చెప్పారు. ఈ పరికరాలతో రైతులకు, పశువులకు ఎటువంటి ప్రమాదం ఉండబోదన్నారు. రైతులు ఆసక్తి చూపితే ఇటువంటి పరికరాలు ఏర్పాటుకు విద్యార్థులు సహకరిస్తారని రైతు భరోసా కేంద్రం ఇన్‌చార్జి ఎండీ షరీఫ్ తెలిపారు.

నలుగురిపై దాడి కేసు నమోదు

పెనమలూరు: వణుకూరు గ్రామంలో ఓ బాలికను వేధించిన యువకుడిని మందలించిన వ్యక్తి పై నలుగురు వ్యక్తులు దాడి చేయడంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు కథనం మేరకు వణుకూరుకు చెందిన వసంతరావు కుమార్తె(10)ను అదే గ్రామానికి చెందిన కార్తీక్ అనే యువకుడు వెంటపడి వేధించసాగాడు. దీంతో ఆ బాలిక తండ్రికి చెప్పడంతో కార్తీక్‌ను మందలించారు. ఈ విషయం తెలుసుకున్న కార్తీక్ కుటుంబ సభ్యులు అశోక్, జాషువా, పద్మ, కార్తీక్ కర్రతో వసంతరావు పై దాడి చేశారు. ఈ దాడిలో వసంతరావు తలకు గాయమైంది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

కృష్ణవేణి విద్యాసంస్థల కరస్పాండెంట్ మృతి



పెనమలూరు: పోరంకిలోని కృష్ణవేణి విద్యా సంస్థల కరస్పాండెంట్ తాతినేని సత్యవతి(62) మృతి చెందారు. ఆమెకు శుక్రవారం వేకువజామున గుండెనొప్పి రావడంతో తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందారు. ఆమె కృష్ణవేణి విద్యా సంస్థల కరస్పాండెంట్‌గా, తాతినేని గోపయ్య అకాడమీ కార్యదర్శిగా ఉన్నారు. కృష్ణవేణి విద్యా సంస్థల వ్యవస్థాపకుడు తాతినేని సత్యనారాయణకు ఆమె భార్య. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. పలువురు ప్రముఖులు, నేతలు తాతినేని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

జీవాల పెంపకంతో రైతుల ఆర్థిక ప్రగతి



గన్నవరం రూరల్: గొర్రెలు, మేకలు పెంపకంతో రైతులు ఆర్థిక ప్రగతి సాధించాలని గన్నవరం పశుసంవర్థక శాఖ ఏడీఏ డాక్టర్ కె.రాధాకృష్ణ మూర్తి చెప్పారు. మండలంలోని కొత్తగూడెం గ్రామంలో ఎన్టీఆర్ పశువైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మండా శ్రీనివాస్‌తో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో జీవాల పెంపకం కుటుంబ ఆదాయాలను పెంచడంలో కీలకపాత్ర వహిస్తున్నాయన్నారు. నీటి వనరులు, వర్షపాతం తక్కువగా ఉన్న మెట్ట, కొండ ప్రాంతాల్లో ఈ జీవాల పెంపకాన్ని ప్రధాన ఆర్థిక వనరుల పేర్కొన్నారు. గొర్రెలు, మేకలు అనేక రకాల మొక్కలను తింటాయని, కలుపు మొక్కల నాశకాలుగా ఉపయోగపడతాయన్నారు. ఈ శిబిరంలో 16 సాధారణ, 512 గొర్రెలు, 194 మేకలకు చికిత్స అందించారు. వెటర్నరీ కళాశాల చివరి సంవత్సరం విద్యార్థులు, అధ్యాపకులు, వెటర్నరీ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ నరేంద్రనాథ్, సుస్మిత, శిరీషా సుధీర్‌బాబు పాల్గొన్నారు.

విజిలెన్స్ నివేదికపై చర్యలకు లోకాయుక్త ఆదేశం

ఉయ్యూరు: పంచాయతీగా ఉన్ననాటి నుంచి గత ప్రభుత్వ హయాం వరకూ పట్టణంలోని అనధికార లే అవుట్లపై చర్యలు తీసుకోవాల్సిందిగా లోకాయుక్త ఆదేశాలు జారీ చేసింది. 2005 నుంచి లే అవుట్ల విషయంలో బాధ్యతగా పనిచేయని అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాల్సిందిగా లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఉయ్యూరుకు చెందిన సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ ఉయ్యూరులో అనధికార లే అవుట్లపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇచ్చిన నివేదికపై చర్యలు తీసుకోలేదని లోకాయుక్తకు 2020 ఫిబ్రవరిలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై విచారించిన జస్టిస్ లక్ష్మణరెడ్డి సమగ్ర విచారణ చేపట్టి, నివేదిక సమర్పించాల్సిందిగా లోకాయుక్త ఇన్వెస్టిగేషన్ డిప్యూటీ డైరెక్టర్ రాజ్‌కుమార్‌ను ఆదేశించారు. లోకాయుక్త ఆదేశాలతో విచారణ అధికారి రాజ్‌కుమార్ విజిలెన్స్ నివేదిక ఆధారంగా 30 అనధికార లే అవుట్లను గుర్తించి, సమగ్ర నివేదిక సమర్పించారు. విచారించిన లోకాయుక్త జస్టిస్ లక్ష్మణరెడ్డి అప్పటి పంచాయతీ నుంచి నగర పంచాయతీ అప్‌గ్రేడ్ వరకూ పనిచేసిన 21 మంది కార్యదర్శులు, కమిషనర్లు, 12 మంది టౌన్ ప్లానింగ్ అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. లోకాయుక్త ఉత్తర్వులతో అధికారులతో గుబులు మొదలైంది.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు జట్లు ఎంపిక



రాష్ట్ర పోటీలకు ఎంపికైన జట్టుతో హెచ్ఎం సుబ్బారావు, కేవీఆర్ కిషోర్, లక్ష్మణరావు

గన్నవరం రూరల్: క్రీడలు విద్యార్థుల్లో మానసిక ఉల్లాసాన్ని, శారీరక దారుఢ్యాన్ని పెంచుతాయని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ముస్తాబాద జెడ్పీహైస్కూల్లో ఉమ్మడి కృష్ణాజిల్లా అండర్-14, అండర్-17 బాలుర, బాలికల రగ్బీ క్రీడా ఎంపికలు శుక్రవారం జరిగాయి. ఈ ఎంపికలకు రెండు జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు హాజరయ్యారు. 150 మంది బాలికలు, 250 మంది బాలురు పాల్గొని రగ్బీలో తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించారు. ఈ పోటీల్లో పాల్గొన్న అండర్-14 బాలురు 12 మంది, బాలికలు 12 మంది, అండర్-17 బాలురు 12 మంది, బాలికలు 12 మంది రెండు జిల్లాల్లోని వివిధ పాఠశాలల నుంచి ఎంపికయ్యారు. ఈ నాలుగు జట్లు ఈ నెల 29వ తేదీ నుంచి కర్నూలు జిల్లా నందికొట్కూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం ఎంవీ సుబ్బారావు తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి 50 మంది వ్యాయామ ఉపాధ్యాయులు, టెక్నికల్ సిబ్బంది పాల్గొని పోటీలు నిర్వహించారు. కృష్ణా జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేవీఆర్ కిషోర్ క్రీడాకారులకు, పాల్గొన్న పీఈటీలు టెక్నికల్ సిబ్బందికి భోజనాలు వితరణగా అందజేయగా, ఆయన దాతృత్వాన్ని పలువురు అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్, కార్యదర్శి సీహెచ్ చంద్రశేఖర్(చందు), పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు లక్ష్మణరావు, కేవీ రామారావు, సీహెచ్ బాలకృష్ణ పాల్గొన్నారు.

అవసరానికి మించి మందులు వినియోగించొద్దు



పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, వీఏఏలు

ఉంగుటూరు: అపరాల సాగులో అవసరానికి మించి రసాయనిక మందులు పిచికారీ చేయవద్దని మండల వ్యవసాయ శాఖ అధికారి హరీష్‌కుమార్ సూచించారు. చికినాల గ్రామంలో పొలంబడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మినుము పంట ఎదిగే దశలో ఉందని, అక్కడక్కడ బూడిద తెగులు, తుప్పు తెగులు కనబడుతున్నాయని చెప్పారు. పురుగు ఉధృతి అంతగా లేదని, అవసరానికి మించి రసాయనిక పురుగు మందులు పిచికారీ చేయవద్దన్నారు. పలు చోట్ల పల్లాకు తెగులు కనిపిస్తుందని తెలిపారు. ఈ తెగులు సోకిన మొక్కలు పీకి కాల్చివేయాలన్నారు. దోమల ఉధృతిని తగ్గించేందుకు పొలంలో గ్రీజు పూసిన పసుపు రంగు అట్టలు ఉంచాలని పేర్కొన్నారు. మినుము పంటలో విత్తన ఎంపిక, విత్తన శుద్ధి, కలుపు మందులు, తెగుళ్లు, పురుగుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ దుర్గా నాగేశ్వరరావు, వీఏఏలు పాల్గొన్నారు.

సమర్థంగా ధాన్యం కొనుగోళ్లు

వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చాట్ల విజయ్‌బాబు

కంకిపాడు: ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లు సమర్థంగా సాగాయని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చాట్ల విజయ్‌బాబు పేర్కొన్నారు. స్థానిక మార్కెట్‌యార్డులోని సలహా మండలి కార్యాలయంలో సలహా మండలి విస్తృత సమావేశం శుక్రవారం నిర్వహించారు. చాట్ల విజయ్‌బాబు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి 30 వేల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం సేకరించారన్నారు. రూ.60 కోట్లు సొమ్ము రైతు ఖాతాలకు జమ చేశారన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు మాట్లాడుతూ రైతులకు అండగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. రైతులకు మేలు జరుగుతున్నా, మద్దతు ధర అందేలా చర్యలు చేపడుతున్నా ప్రతిపక్షాలు మాత్రం విషం చిమ్ముతున్నాయన్నారు. విమర్శలను తిప్పికొట్టాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పీఎం కిరణ్, సలహా మండలి సభ్యులు నకరికంటి శేఖర్, ఎస్.కోటేశ్వరరావు, జొన్నలగడ్డ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లో కానిస్టేబుల్ పరీక్ష ప్రశ్నపత్రాలు



కానూరు వీఆర్ సిద్ధార్థలో భద్రపరిచిన ప్రశ్నపత్రాలు

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో కానిస్టేబుల్ రాతపరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లో శుక్రవారం భద్రపరిచారు. ఏపీ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రశ్నపత్రాలతో ఉన్న 144 బాక్సులు శుక్రవారం వచ్చాయి. వీటిని డీసీపీ మోకా సత్తిబాబు పర్యవేక్షణలో కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. అడ్మిన్ డీసీపీ సత్తిబాబు వివరాలు తెలుపుతూ పరీక్ష 22వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. కాగా పెనమలూరు మండలంలో ఏడు పరీక్ష కేంద్రాలలో మొత్తం ఆరువేల మంది వరకు పరీక్ష రాయనున్నారు. కార్యక్రమంలో డీఎస్పీ విజయ్‌పాల్, పెనమలూరు సీఐ గోవిందరాజు, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, డీన్ బావినేని పాండురంగారావు పాల్గొన్నారు.

పారిశ్రామికవాడ నిర్వాసితుల అర్జీలపై విచారణ



మల్లవల్లిలో సాగుదారులను విచారిస్తున్న తహసీల్దార్లు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం మల్లవల్లిలోని ఏపీఐఐసీ ఇండ్రస్టియల్ పార్క్ భూసేకరణలో నష్టపరిహారం అందని సాగుదారుల అర్జీల విచారణ ప్రక్రియను శుక్రవారం చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో ఇప్పటికే జేసీ, డీఆర్వో, గుడివాడ ఆర్డీఓలతో అర్హులైన సాగుదారులను గుర్తించేందుకు కలెక్టర్ ప్రత్యేక కమిటీని నియమించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో గుడివాడ ఆర్డీఓ కార్యాలయంలో ఇటీవల నష్టపరిహారం అందని సాగుదారుల నుంచి అర్జీల స్వీకరణ చేపట్టారు. నష్టపరిహారం మంజూరు కోరుతూ 247 మంది సాగుదారులు అర్జీలు పెట్టడంతో గుడివాడ ఆర్డీఓ పి.పద్మావతి వీటిపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. దీని కోసం కంకిపాడు, పామర్రు, గుడ్లవల్లేరు తహసీల్దార్లు టీవీ సతీష్, భరత్‌రెడ్డి, రెహమాన్ సారథ్యంలో మూడు ప్రత్యేక బృందాలను ఆర్డీఓ పద్మావతి నియమించారు. దీంతో సాగుదారుల అర్జీలపై విచారణ చేపట్టేందుకు అధికారుల బృందాలు మల్లవల్లిలో పర్యటించారు. తహసీల్దార్ నేతృత్వంలో గ్రామ సర్వేయర్, వీఆర్వో, వీఆర్ఏలతో కూడిన ఈ బృందాలు తొలిరోజు క్షేత్రస్థాయిలో 30 మంది అర్జీలపై విచారణ నిర్వహించారు. సర్వే నంబర్ 11లో అర్జీదారులు సాగు చేపట్టిన భూమి గుర్తించడం, దాని విస్తీర్ణం లెక్కించడం, అందుకు తగిన ఆధారాలను పరిశీలించడం, హద్దుదారులను విచారించడం నిర్వహించారు. సర్వే నంబర్ 11లో దాదాపు 1,400 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉండడంతో క్షేత్రస్థాయిలో ఈ విచారణ అధికారుల బృందానికి కష్టసాధ్యంగా మారింది. ఇప్పటికే పలుచోట్ల కర్మాగారాలు నిర్మించడంతో భూ విస్తీర్ణం సర్వే చేసేందుకు సాధ్యపడకపోవడం, ఒకే భూమికి ఇద్దరు సాగుదారులుగా చెప్పడం, ఇంతకు ముందే నష్టపరిహారం ఇచ్చిన భూమికి ఇప్పుడు మరొకరు అర్జీ పెట్టడంతో రెవెన్యూ అధికారుల విచారణ అర్ధాంతరంగా ముగిసింది. దీనిపై ఉన్నతాధికారులకు నివేదించి, తగిన సూచనలు తీసుకున్న తర్వాతే విచారణ చేపట్టనున్నట్లు చెప్పారు.